# పరివర్తనము

రచయిత :

ఏ. శేషాచలపతి, బి. ఏ.

౧

మోహనరావు విషయావినోది. ఎట్టి సంసారినైనా కుమ్మరపురుగల్లే దొలిచేయగల దిట్టరి. పేరెన్నికగన్న కుటుంబమున జనించినవాడే అయినను దుర్గుణ మాతనికి ఉగ్గుపాలతోనే కలిగినది. రత్నాకరమున నత్తగుల్ల పుట్టినది. తులసివనములో గంజాయిమొలక మొలచినది. మోహనరావుతండ్రి నారాయణరావు. ఉన్నతోద్యోగముజేసి ధనము దోసిళ్లాదిగ గణించాడు. పిల్లికైనా బిచ్చంపెట్టని పినాసి. వయస్సులోనున్న మోహనుడికి దమ్మిడికూడా అందనీయడు. లంజతనముతో దొంగతనము అంటియేయుండును. మురికి గుంటతో వాసనయుండదా ? సిగరెట్లకొరకు అమ్మమ్మ వత్తులపెట్టెలోని డబ్బులు గైరుహాజరు. ఆమె యిల్లంతా చెడమడ వెదికినా లాభంలేదు. ఇంటిదొంగ నీశ్వరుడైనా పట్టలేడు. చిలికి చిలికి గాలివాన యగుట సహజము కదా! పదునారు వత్సరముల ప్రాయమున విఘ్నేశ్వరపూజ చేసినాడు జారత్వమునకు. పందొమ్మిది వర్షములవాడగునాటికి ఆరితేరి మబ్బు విడచిన సూర్యుడువలె మొగుణ్ణివిడచిన ముండలాగున సిగ్గువిడచినాడు.

౨

సుబ్బారావు పంతులు నెల్లూరునందు న్యాయమూర్తి. న్యాయవిషయములందు అతడు అద్భుత ప్రజ్ఞావంతుడు. అతడు అవతారము దాల్చిన ధర్మదేవత. అందుచే నాతనికీర్తి వెన్నెలవలె మంచిగంధపు చెట్టువలె దిశలు మారుమ్రోగుచున్నది

సుశీల అతని ఏకైకపుత్రిక. చక్కని చుక్క. విద్యావతి విశేషించి గుణవతి. లుబ్ధాగ్రేసర చక్రవర్తి తనధనమునకు చూపు జాగ్రత్తకంటే నీమె తనమానధనమున గంటెలో వత్తిడుకొని రక్షించుకొనును. ఏకపుత్రిక యగుటచే పూవులలోపెట్టి పెంచిరి. ధనపిశాచ మావహించిన తల్లి యీమెపాలిటి జేష్టాదేవత కాబోలును! ధనవంతున కీయవలెనని ఆమెతల్లి నరసమ్మకు కోరిక. దర్జాగల విద్యాధికున కియ్యవలెనని రావుగారి యిచ్ఛ. ఉన్నసంబంధాలన్నీ స్థనశల్యపరీక్ష చేసినారు. ఒకటి నచ్చలా. ఎక్కడ లేకపోతే అక్కమగడే దిక్కన్నట్లు తుదకు మెరకవీధులోనున్న మోహనరావుకే స్థిరపరచారు. సిరిగల కొంపమరి. నారాయణరావు దగ్గిర లక్ష రూపాయలు నగదుకలదు. మోహనుడు మొద్దయితేనేమి? లక్ష్మీ సరస్వతులకు ఒక్కచో ఎట్లు పొసగును. అది గగన కుసుమమేగదా! విద్యావతి గుణవతి సౌందర్యవతియగు సుశీల శుంఠాగ్రేసర చక్రవర్తి జారశిఖామణి నారాభాగ్యదామోదరుడగు మోహనునకిచ్చుట

కాకిముక్కు-న దొండపండు గట్టుటయే. పెళ్ళి పెళపెళలాడింది. సుశీలకు పదివేలరూపాయల నగలుపెట్టారు. నరసమ్మ మొఖం చాటంతఅయింది. భోగంమేళం, తిరుచునాపల్లి సన్నాయిమేళం, యింకా ఎన్నో అవన్నీ తలిస్తే తలనొప్పి. వివాహం శాంతంగా పూర్తి అయింది.

3

అదుపాజ్ఞలలోలేనివా రక్కు-అకు రారనుట లోకవిదితమే. అమావాస్యనాడు రాజంతరించినట్లు హఠాత్తుగా మన నారాయణరావు మాయమయ్యాడు. మోహనరావు నోము ఫలించింది. లక్షరూపాయల కధికారి. ఆంబోతువలె అతనిస్వేచ్ఛ హెచ్చింది. అతని పని మూడుపూవ్వు లారుకాయలైంది. పట్టపగ్గంలేకపోయినై. ధనముతో మదము తామర తంపరైంది. అసలే కోతి కొబ్బరికాయ దొరికితే చెప్పాలా! ఉన్నతోద్యోగము జేసి రైతులచేతులనుండి రక్తపుబొట్లువలె లంకించి పుణికి కుదువబెట్టిన నారాయణరావు ధనం హారితికర్పూరంలా హరించిపోయింది. ఆధనమిప్పుడు భోగము రంగసాని కంఠములో డాలరుగొలుసుగాను శ్రీహరి మొలకు వడ్డాణముగాను మారిపోయింది. ఆహా! లక్ష్మి చలచిత్తకదా! చలపాదులలో మిక్కిలి జలపాదినైన సమీరుని కంటె లచ్చి చలపాది కదా! ఎన్నడు ఎట్టిగతి కలుగునో ఎవరికెరుక ?

ఆకలి రుచిఎరుగదు. నిద్రసుఖమెరుగదు. చిదుము సిగ్గెరుగదు. మోహము గుడ్డిది. లేమిదోషమెఱుంగదు. అంధకారము మాడ్కి- దారిద్ర్యము సకల దుష్కార్యములకు మూలకందము. యీపరివర్తనము మోహనరావును గజదొంగగాచేసింది. కాని సుబ్బారావు ఎప్పటికప్పుడే నీతిమార్గములు నూరిపోయుచుండెను. అవి చెవిటివాని ముదుంశంఖమూదినట్లైనది. వాని వాక్కు- సముద్రమధ్య బిందువైనది. నిర్భాగ్యుని బాగుచేయువారు కలరా? సత్వరసాగరసంగమ సముత్సాహయగు స్రవంతిదారుణ వేగమునరి కట్టగలవారెవరు?

ఆశాపాశము దీర్ఘమైనది. అట్టిపాశమే మనమోహనరావును బంధించినది. అదేవానిని తోడైనలేకుండ ఒంటరిగా ఆపేరయ్యయింట ప్రవేశించి తస్కరింపుమని ప్రోత్సహించినది. దొంగకి తోడెవరువస్తారు! అది అమావాస్య చీకటి నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి వేసంకాలమగట చేవ కాబోలు ప్రజలంతా పెరటిదొడ్లలోను వీధుల్లోను గాఢంగా నిద్రపోతున్నారు. మోహనరావు నెమ్మదిగా పెరటిగోడదాటాడు. గాఢంగా నిద్రపోతున్నారు వీరమ్మ పేరయ్యను. తిన్నమీదలాంతరుమాత్రం ఊపిరిపోయేవాడల్లేఉంది. వీరమ్మతలక్రిందఉన్న యింటితాళాలు లంకించుకున్నాడు యిల్లాంతా వెతకి, యినపపెట్టి తెరిచూడు. దొరికినకాడికి లంకించుకొని వీధితలుపు తెరిచి కాళ్లకు బుద్ధిచెప్పాడు.

సమీరుడు మందగమనము చేయుచున్నాడు. నిశాకాంతను నిర్మూలింప కాలపురుషుడు పదునుపెట్టిన గండ్రగొడ్డలాయనట్లు తూర్పున బాలార్కుడు పొడసూపినాడు. చీకటితోపాటు మమ్మికూడా నశింపచేయవద్దు అనట్లు కాకులు కాకారవము చేయుచున్నవి.

ఆసమయములో నెల్లూరుపుర వీధులలో పేర్యయ్యయింట్లో దొంగలుపడ్డవిషయం బల

తైలబిందువై పాకిపోయింది. శాంతిస్థాపకులు వేయికళ్లతోచూచారు. తేలింది దొంగ మోహనరావని. రక్షకభటాధికారి న్యాయమూర్తి ఎదుట బెట్టెను. మిన్నువిరిగి మీదపడినట్లైంది సుబ్బారావుకి యిటువంటి ఏకపుత్రిక అటు ధర్మమము గుండెచెరువైనది. నేరముతీసి వేసికొన్నచో నాలుగువేలుయిచ్చెదనని పేరయ్యకు కబురుపంపెను. అతడు ఆదిలో మెత్తబడినాడు కాని భార్యనూతిలో నోగోతిలో నోదిగుతానంటే 'ఊ' అనలేకపోయాడు. అల్లారుముద్దుగ బెంచిన కూతునికై ఆచంద్ర తారార్కమగు కీర్తిధనము వదలుకొనరాదని న్యాయముకంటె తనకెవ్వరు అప్తులు లేరని నిశ్చయించుకొని తీర్పుచవికకుబోయెను. పంతులు న్యాయప్రియత్వ మీనేరములో దెల్లమగునని ప్రజలనుకొనిరి. ఇసుక వేసిన రాలకుండ జనము కిటకిటలాడుచు మూగిరి. రచ్చబండపై పెద్దలు గూర్చుండిరి. నేరవిచారణ ప్రారంభించిరి. సాక్ష్యము పూర్తిఅయినది. నీవేమైనా చెప్పుకొందువా అనిరావు జామాత నుప్రశ్నించెను. మోహనరావుకి గుండెలో రైళ్లు పరుగెత్తినై. మెఱుపులాగు సుశీల దివ్యమంగళ విగ్రహము నేత్రములకు కనుపించింది. వాని దుర్గుణములు దగ్ధమైనవి పశ్చాత్తాపముచే హృదయము బరువెక్కినది. మాటాడ నోరురాలేదు. సభఅంతయు నిశ్శబ్దముగానుండెను, చీమ చిటుక్కుమనుటలేదు. జేగురుముద్దవలె ఎఱ్ఱబారిన మొగముతో ఎఱ్ఱబారిన కండ్లతో న్యాయమూర్తి లేచి ముక్కుమొగము చూడక — 'నీకు అయిదుసంవత్సరములు ఖైదువిధించితిని' అని తీరుపుచేసెను. మరుగొమ్ము విరిగిన మదుగు నీరులా సదస్యులు చలించిపోయిరి. న్యాయమూర్తిని వేయినోళ్ళ పొగడిరి ప్రజలు.

## ౪

విద్యావతిఅయ్యు స్వేచ్ఛాపరురాలు కాలేకపోయినది. సుశీల మానమనే పంజరములో పడిన దీకీరము. దానిలోనే మాధుర్యమున్నదని ఆమెవాదం. కామ తృప్తికొరకు మానమువిడుట ఆమెకు హేయమనిపించినది.

* * *

బంధుగులింట వివాహమునకు వెళ్ళి సుశీల అప్పుడే అరుదెంచెను. గుమ్మములో గాలుంచుట తోడనే మబ్బులేని చిచ్చుఅపిడుగువంటి ఈ ఘోరవార్త నెవరో ఆమెచెవుల వేసిరి. ఆమె అట్లనే మూర్ఛాపరవశురాలైనది. ఆత్మహత్య చేసికొనుట ధీరత్వము కాదనుకొన్నది.

కష్టసుఖములు కావడికుండలనుకొన్నది. తనవిద్య తనగుణము ఒకని బాగుచేయగలిగిన నాడే ఆమె ధన్యురాలనుకొన్నది. ఆఅయిదు సంవత్సరములు అమె ఏకాగ్రత వృద్ధిచేసుకొన్నది. వజ్రమును సానపట్టినట్లు అయినది. ఆమె సంఘమును ఉద్ధరించినది. గిఱ్ఱున అయిదు సంవత్సరములు గడచినవి మోహనరావు యీ అయిదు సంవత్సరములలో అయిదు పుటములు పెట్టిన బంగారములా తయారయాడు. అతనికి గడచిన జీవితము అమావాస్యలా గనిపించింది. నేడు సుశీల పాదముల వ్రాలాడు ఆసద్గుణరాశి వానికి ఆ అమృతకరుని చూపినది-యిట్టి క్షమాదేవతలు భారతదేశమున కలుగుటకు ఈ భారతావని ఏమినోము నోచినదో కదా!